క్లుప్తంగా

రామాలయంలో ఉద్యోగ సంఘాల నేతలు



ఆలయంలో ఉద్యోగ సంఘాల నేతలు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీజేఈజేఏసీ కన్వీనర్ ఏలూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీఎన్జీవోస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ, ధనియాల వెంకటేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను తీసుకోవాలని, తద్వారా పోషక విలువలు సమృద్ధిగా అందుతాయని సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన నారాయణపురంలో ఐసీడీఎస్, వ్యవసాయ కళాశాల సంయుక్తంగా పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకారం క్రమం తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అలేఖ్య, సూపర్‌వైజర్ రమాదేవి, కళాశాల శాస్త్రవేత్తలు నాగాంజలి, జంబమ్మ, కృష్ణతేజ, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

మణుగూరుటౌన్: డైరెక్టర్ (పా) స్థాయిలో రెండుసార్లు, చైర్మన్ స్థాయిలో ఒకసారి కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ఒప్పందం చేసుకుని సర్క్యులర్లు జారీ చేయడంలో జాప్యం చేయడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. శుక్రవారం యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై ఒప్పందం చేసుకుని సర్క్యులర్లు జారీ చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కార్మిక వర్గం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామనర్సయ్య, మేకల ఈశ్వర్‌రావు, పుల్లారావు, ఆవుల నాగరాజు, గంగాధర్‌రావు, ఆదర్ల సురేందర్, జి.శ్రీనివాసరావు, రవికుమార్, సాయిప్రకాశచారి, నాగుల సతీశ్, తెన్నేటి నారాయణ, హిమాముద్దీన్, నాగేశ్వరరావు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎంపీడీఓ అప్పారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేతనాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటప్పయ్య, వినోద్, ముత్తారావు, రామారావు, మహేశ్, వెంకయ్య, విజయ్, కన్నారావు, రాజు, సీతారాములు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరకగూడెం: 33/11 కేవీ కరకగూడెం ఉపకేంద్రంలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని మండల ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ తెలిపారు. వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బస్సు కనిపించుట లేదు..

కరకగూడెం ఏజెన్సీ వాసుల ఆవేదన

- రోడ్లు మెరుగ్గా ఉన్నా.. బస్సులు సున్నా..
- అనేక గ్రామాలకు లేని బస్సు సర్వీసులు
- ప్రైవేట్ వాహనాల్లో విద్యార్థులు, మహిళలు, కూలీల ప్రమాదకర ప్రయాణం
- మహాలక్ష్మి పథకానికి దూరమవుతున్న మండలవాసులు



కరకగూడెం: 'కళ్లు ఉన్నాయని సంతోషించే లోపే.. కన్నీళ్లు కూడా ఉన్నాయని గుర్తు చేస్తాడు..' అని ఓ సినిమాలో డైలాగ్.. అలాగే, కరకగూడెం ఏజెన్సీ వాసులు సైతం.. రోడ్లు ఉన్నాయని సంతోషించాలా.. లేక బస్సు సౌకర్యం లేక బాధపడాలా..? అని ఊగిసలాడుతున్నారు. రోడ్ల సౌకర్యం సరిగ్గా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు పలు గ్రామాలకు రావడం లేదు. దీంతో విద్యార్థులు, మహిళలు, కూలీలు ఇతర ప్రయాణికులు అద్దె ఆటోలు ఇతర వాహనాల్లో ప్రమాదకరరీతిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో అసౌకర్యమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతోంది. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత బస్ ప్రయాణం) ప్రయోజనాలు ఈ ప్రాంత మహిళలకు అందకుండా పోతున్నాయి. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రాంతాలకు రోడ్లు వచ్చాయని సంతోషించిన ప్రజలకు, ప్రజా రవాణా లేమి పెను సమస్యగా మారింది.

బస్సు సర్వీస్ రద్దు

మండలంలోని కన్నాయిగూడెం, వీరాపురం, రేగళ్ల, చిరుమళ్ల, భర్లగూడెం, రఘునాథపాలెం, కొత్తూరు, రేగుళ్ల, చొప్పలతో పాటు పలు గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు ఏర్పడ్డాయి. ఇంతకముందు బర్లగూడెం బస్ సర్వీస్ ఉండేది. ఇప్పుడు దానిని అధికారులు రద్దు చేశారు. రోడ్లు సరిగా లేవని గతంలో బస్సులను నిలిపివేసిన అధికారులు ఇప్పుడు రోడ్లు బాగున్నప్పటికీ బస్సులు నడపకపోవడానికి సరైన కారణాలు చెప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతలను విస్మరించడమేనని మండిపడుతున్నారు.



చిరుమళ్ల గ్రామంలో ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రజలు (ఫైల్)

వారి కష్టాలు వర్ణనాతీతం..

ప్రభుత్వ బస్సు సేవలు లేకపోవడం వల్ల గ్రామాల్లోని ప్రతి వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ముఖ్యంగా పాఠశాల, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేక చదువుకు ఆటంకం కలుగుతోంది. ఉదయం సరైన సమయానికి బడులకు చేరుకోలేకపోవడంతోపాటు సాయంత్రం తిరిగి ఇంటికి రావడానికి నానా తంటాలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు ఆటోల్లో, ప్రైవేట్ వాహనాల్లో వేలాడుతూ వెళ్లాల్సి వస్తోంది. రోజువారీ పనులకు వెళ్లే కూలీలు.. అనారోగ్యంతో ఉన్న వృద్ధులు, రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.



బస్సుల రాకపోకలు లేకపోవడంతో ట్రాక్టర్‌లో తరలివెళ్తున్న కూలీలు

మహాలక్ష్మి పథకానికి దూరం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. కరకగూడెం మండలంలోని అనేక గ్రామాలకు బస్సు సేవలు లేకపోవడం వల్ల ఈ పథకం ప్రయోజనాలకు మహిళలు దూరమవుతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్తే ఆర్థిక భారం పడుతోంది. ఈ సమస్యపై మణుగూరు ఆర్టీసీ డీపో మేనేజర్ శ్యామ్‌సుందర్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం ఉన్న బస్సు సర్వీసులను ప్రజలు మరింతగా ఆదరిస్తే భవిష్యత్‌లో తప్పకుండా పెంచుతామని పేర్కొన్నారు.

బస్సులు నడపాలి..



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉంది కానీ బస్సు మాత్రం రావడం లేదు. పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. ఆటోల్లో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామానికి బస్ రాకపోవడంతో మహాలక్ష్మి పథకం మాకు లేనట్లే. ప్రభుత్వం మా గ్రామాలకు బస్సులు నడపాలి. ఇబ్బందులు లేకుండా చూడాలి.

–కొమరం గౌరమ్మ, వీరాపురం

అధికారులు దృష్టి సారించాలి..



కరకగూడెం మండలంలో ప్రజలు పడుతున్న రవాణా కష్టాలపై అధికారులు వెంటనే దృష్టి సారించాలి. రోడ్లున్న చోట బస్సులను నడిపి, ప్రజలకు ఉపశమనం కలిగించాలి. ప్రస్తుతం ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం చాలా మెరుగుపడింది. ఇది ప్రజల ప్రాణాలతో ముడిపడిన సమస్య. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి.

–గోగు లీలా, రేగుళ్ల

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన



దుమ్ముగూడెం: అవగాహన కల్పిస్తున్న సుభాష్

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారిశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్, అవగాహన క్యాంపు శుక్రవారం నిర్వహించారు. క్యాంపులో భాగంగా బీపీ, షుగర్, కేన్సర్, స్క్రీనింగ్, టీబీ వ్యాధి స్క్రీనింగ్, గర్భవతులకు, టీకా, రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు, మానసిక ఆరోగ్యం, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. సుభాష్, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలు చేస్తున్నాం..

పినపాక: మహిళలు, గర్భిణులు, పిల్లలకు మెరుగైన ఆరోగ్య సేవల కోసం స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మణుగూరు వైద్యురాలు సుప్రియ తెలిపారు. శుక్రవారం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించి, మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్రుతి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై నిర్లక్ష్యం తగదు..

అశ్వారావుపేటరూరల్: వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం తగదని, సకాలంలో వైద్యులను కలిసి చికిత్స పొందాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రకాష్, నవీన్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పినపాక: మహిళలకు పరీక్షలు చేస్తున్న సుప్రియ



చర్ల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నగేశ్

బోదనెల్లిలో వైద్యశిబిరం

చర్ల: మండలంలోని బోదనెల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సత్యనారయణపురం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి నగేశ్ 32 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. శిబిరంలో హెచ్ఈఓ బాబూరావు, సిబ్బంది కవిత, సంధ్య, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు భేష్



అధికారులతో మాట్లాడుతున్న వెంకటాచారి

మణుగూరుటౌన్: సింగరేణి పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఉపాధ్యాయుల పనితీరుకు పది ఫలితాలే నిదర్శనమని ఎడ్యుకేషన్ జీఎం, సొసైటీ కార్యదర్శి వెంకటాచారి అన్నారు. శుక్రవారం ఏరియాలో పర్యటించిన ఆయన పీవీకాలనీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సైన్స్ లేబొరేటరీ పరిశీలించడంతో పాటు స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ, పదో తరగతి ఫలితాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఇతర అధికారులతో కలిసి పాఠశాలలో భవిష్యత్తులో సీబీఎస్ఈ ప్రవేశపెట్టేందుకు చేపట్టనున్న అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసచారి, రమేశ్, హెచ్ఎం కల్యాణి పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్

మణుగూరురూరల్: రానున్న కాలంలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు అన్నారు. ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో జరిగిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అబ్దుల్ రవూఫ్, పొదిల రామకృష్ణ, దడిగల అభిలాష్, కర్రి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించండి..

చర్ల: రైతాంగానికి అవసరమైన మేరకు యూరియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మచ్చా రామారావు, దొడ్డి హరినాగవర్మ, బందెల చంటి, షారోని, వరలక్ష్మి, శ్యామల చంద్రం, రాంబాబు, దున్న సాయి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలకు వీధి దీపాలు, హోల్డర్లు, వైర్లను శుక్రవారం మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీధి దీపాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, అశోక్, పీరినాకి నవీన్, ఎడారి రమేశ్, బాడిశ సతీశ్, నోముల రవి, మండారి ఆదయ్య, రాములు, శ్రీను పాల్గొన్నారు.

జగ్గారంలో గ్రామ సదస్సు



సదస్సులో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గిరిజన మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మండలంలోని జగ్గారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆది కర్మ యోగి అభియాన్ గ్రామ సదస్సును నిర్వహించారు. 2030 నాటికి జగ్గారం గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే దిశగా ప్రణాళికలు రూపొందించనున్నామని అధికారులు తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్యాకేజీలు ఇవ్వాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మోడల్ అధికారి సత్తిబాబు, గ్రామస్తులు కారం శ్రీరాములు, వంక జానకీరాముడు, వసంతరావు, జోగారావు, ఫారెస్ట్ అధికారులు, అంగన్వాడీలు, స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

చర్ల: వసతి గృహాల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చర్లలో ధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యాక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ముసలి సతీశ్, పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న డైలీవేజ్ వర్కర్లు

బతుకమ్మ సంబురాలు



భద్రాచలంటౌన్: బతుకమ్మలతో అధ్యాపకులు



దుమ్ముగూడెం: బతుకమ్మలతో ఉపాధ్యాయులు



ములకలపల్లి: మాధారం పాఠశాలలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ కె.జాన్‌మిల్టన్ మట్లాడుతూ.. బతుకమ్మ పండుగ విశిష్టత, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ రాఘసుమ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హవిలా, కపిలభారతి, నాగసమీరా, హిమజ, సుమలత, ఆఫీస్ సూపరింటెండెంట్ రేవతి, శరణ్య, భవాని, కల్పన, పూర్ణిమ, కృష్ణవేణి, ఊర్వశి, కృష్ణవేణి, జ్యోతి, మధులత పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలకు మరో రెండు రోజుల్లో దసరా సెలవులు ఇవ్వనున్న నేపథ్యంలో పాఠశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అరుణకుమారి, రాధాకృష్ణ, సైదులు, గోపాలకృష్ణ, శాంతి, పద్మ, పార్వతి, సరస్వతి, అనూష, జమున, జయమ్మ, కృష్ణకుమారి, సంధ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండలంలోని మాధారం పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, హెచ్ఎంలు స్వరూపాభవాని, శంకర్‌నాయక్, వసంత, సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



బల్లల పంపిణీ ప్రారంభిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: కేపీయూజీ గనిలో పనులు నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ ప్లాంట్ సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శుక్రవారం ఎస్ఎంఎస్ ప్లాంట్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా బుగ్గ, ఖమ్మంతోగు, విప్పలసింగారం ప్రభుత్వ పాఠశాలలకు బల్లలు, కుర్చీలు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ పాఠశాలల నుంచే ప్రారంభమవుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సింగరేణిని ఆదర్శంగా తీసుకుని ప్లాంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్లాంట్ జీఎం కోఆర్డినేషన్ సీవీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా 30 టేబుళ్లు, 50 కుర్చీలు, ఇతర సామగ్రి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఎస్ఓటూ జీఎం శ్రీనివాసాచారి, డీజీఎం (పర్సనల్) రమేశ్, ప్లాంట్ అధికారులు శ్రీహరిరావు, సిబ్బంది, గ్రామస్తులు గోరంట్ల కనకయ్య, శ్రీరాం కల్యాణ్, సోడే రవి, పాల్వంచ రాములు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పంచాయతీ రాజ్ విభాగంలో పినపాక నియోజకవర్గంలో నత్తనడకన సాగుతున్న పనుల్లో వేగం పెంచాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజాభవన్‌లో పంచాయతీరాజ్ విభాగం పినపాక నియోజకవర్గస్థాయి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు వచ్చిన పనుల వివరాలు, పూర్తయిన వాటి వివరాలు సేకరించారు. ఆలస్యంగా జరుగుతున్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్, ఎఫ్‌డీఆర్, ఎంఆర్ఆర్, సీఆర్ఆర్, ఎస్‌టీఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, ఇతర గ్రాంట్లకు సంబంధించి సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, బ్రిడ్జిలు, టాయిలెట్లు, పాఠశాలలు, ప్రహరీలు మొత్తం 1,283 పనులు మంజూరు కాగా వాటి విలువ రూ.167.60 కోట్లు అన్నారు. సమావేశంలో ఈఈ సత్యనారాయణ, బూర్గంపాడు డీఈ వెంకటేశ్వర్లు, గుండాల, ఆళ్లపల్లి డీఈ రామనాథం, మణుగూరు ఏఈ వంశీ, వినీత్ తదితరులు ఉన్నారు.

యోగా, ధ్యానం అలవర్చుకోవాలి..



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ములకలపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ విధిగా యోగా, ధ్యాన సాధన అలవర్చుకోవాలని హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ పొలె మాధురి సూచించారు. హెల్ప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏకాగ్రత పెంపొందించు కోవడం, చదువులపై దృష్టి సారించడం, ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవడం, అనవసరపు ఆలోచనలను దూరం చేసుకోవడం లాంటి అంశాలపై ఆమె విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అతహర్ అలీ, లెక్చరర్ సీహెచ్.రాజేశ్వరి, స్టూడెంట్ కౌన్సిలర్ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ అధ్యాపకుడికి సన్మానం

మణుగూరురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గుండుబిల్లి రామతిరుపతిని రిటైర్డ్ వైద్యులు వి.కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, అధ్యాపకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్, అధ్యాపకులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిప్పన సిద్ధులు, రిటైర్డ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అడవులను రక్షించే బాధ్యత అందరిది

దుమ్ముగూడెం: అడవులను రక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అటవీశాఖ అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు కలిసి ముత్యాలమ్మ ఆలయం చుట్టూ మొక్కలు నాటారు. అడవులు అంతరిస్తే మానవ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఎఫ్ఎస్ఓలు బుచ్చిరాజు, వీరస్వామి, గ్రామస్తులు ముర్రం వీరభద్రం, ఇర్ప వీర్రాజు, కోర్స వీరభద్రం, రేసు బాబు, మడకం జోగయ్య, కొర్స బాలు, అపక గణేశ్, కణితి ముత్తయ్య, అనిల్, గంగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యం

కరకగూడెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ, అటవీ శాఖల అధికారులు గ్రామస్తులతో కలసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. గ్రామం శుభ్రంగా ఉండడం వల్లే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, ప్రతి ఇంటి ముందు చెత్త పేరుకోకుండా, వీధులు శుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సూరయ్య, బీట్ ఆఫీసర్ అశోక్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గ్రామస్తులు రఫీక్ పాల్గొన్నారు.

నర్సరీలో కలుపు మందు పిచికారీ

పోలీసులకు రేంజర్ కమల ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల సెక్షన్‌లోని జానకీ నర్సరీలో గుర్తు తెలియని దుండగులు మొక్కలపై కలుపు మందు పిచికారీ చేయగా.. రేంజర్ కమల శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. నర్సరీలోని మొక్కలపై గుర్తు తెలియని దుండగులు కలుపుమందు పిచికారీ చేయడంతో మొక్కలు మాడిపోయాయి. దీనిని గుర్తించిన అటవీశాఖ సిబ్బంది విరుగుడు మందు పిచికారీ చేసినప్పటికీ చాలా మొక్కలు చనిపోయేలా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని మొక్కలు చనిపోయాయి. దీంతో సదరు దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రేంజర్ కమల ఫిర్యాదులో పేర్కొన్నారు.